
# గమనం

## కోనేరు రాజబాబు



ఇంకా తెల్లవారలేదు.

మసక చీకటిగా వుంది.

రోడ్డు మాత్రం నిర్మానుష్యంగా వుందనే చెప్పాలి.

రెండు కార్లు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

ఒకదానిని మరొకటి తప్పించుకోవాలన్న తపనతో వున్నాయి—కార్ల వేగం పెరిగింది.

నడిపే వారిలో పట్టుదల మరింత పెరిగింది—

పక్కనుండి చూసే వాళ్ళ గుండెలు గుభేలుమంటున్నాయి.

రోడ్డు పక్క టీ స్టాల్‌లో టీ తాగుతున్న నైట్ బీట్ కానిస్టేబులు సింహాచలం కార్లనుచూసి నవ్వుకున్నాడు.

ఆ కార్ల నంబర్లు అతనికి తెలిసినవే.

ఆ కార్లు నడిపేదెవరో కూడా అతనికి తెలుసు.

ఎట్టకేలకు ముందు కారును వెనుక కారు తప్పించుకుంది.

వేగాన్ని కంట్రోలు చేసుకొనే శక్తికూడా ఆ నడిపే అతనిలో లోపించింది. ఫలితంగా ఎదురుగా వచ్చే స్కూటర్‌ను ఢీకొంది.

'ఢణేల్'మన్న శబ్దం. స్కూటర్ ముక్కలై పోయింది. స్కూటర్ మీద వెళ్ళే జంట రోడ్డుకిరువైపులా పడ్డారు.

కారు మాత్రం వెళ్ళి కరెంటు స్తంభాన్ని గుద్దుకొని ఆగిపోయింది.

టీ తాగుతున్న సింహాచలం చేతిలో టీ గ్లాసు క్రింద పడిపోయింది. క్షణంలో ఏక్సిడెంట్ జరిగిన చోటకు వచ్చాడు. రోడ్డంతా రక్తంతో తడిసిపోయింది. స్కూటర్ నడిపిన యువకుడి దగ్గరకు వెళ్ళాడు. మనిషిలో చలనం లేదు.

శ్వాస ఆడుతున్న ఆనవాలే లేదు.

వెంటనే మరో ప్రక్క పడి వున్న స్త్రీ వద్దకు వెళ్ళాడు.

ఆమె శరీరం అంతా రక్తంతో తడిసి వుంది.

ఎక్కడో కొన ఊపిరి ఉన్నట్టుంది.

కారు నడిపినతను అచేతనంగా అక్కడే నిలబడి వున్నాడు. సింహాచలం ఎరగనట్టుగా వెళ్ళిపొమ్మని సైగ చేశాడు. అంతే! మరుక్షణంలో ఆ కుర్రాడు మాయమయ్యాడు.

చుట్టు పక్కలవాళ్ళు ఒకొక్కరే వస్తున్నారు:

సింహాచలం దగ్గర్లో వున్న పబ్లిక్ ఫోన్ బూత్‌కు వెళ్ళాడు.

ఏదో నంబరు డయిల్ చేశాడు.

గుడ్‌మార్నింగ్ సార్! నేను 441 కానిస్టేబుల్నండీ—ఏలూరు రోడ్డులో రామ్‌గోపాల్ థియేటరు దగ్గర ఏక్సిడెంట్ జరిగిందండీ. కారు ఎదురుగా వచ్చే స్కూటర్‌ను గుద్దిందండీ—స్కూటర్ నడిపినతను చనిపోయాడండీ—వెనుక కూర్చున్న అమ్మాయి మాత్రం యింకా ప్రాణంతో వుందండీ—అయ్యా! డ్రైవర్ని అరెస్టు చేయలేదండి—కారు నడిపింది అబ్బాయిగారండీ—అబ్బే! ఎవరూ చూడకుండా పంపించేశానండీ—అలాగేనండీ—కంట్రోలు రూమ్‌కు ఫోను చేస్తానండీ—అంబులెన్స్ రాగానే వాళ్ళను గవర్నమెంటు ఆసుపత్రికి చేర్పిస్తానండీ—నమస్తే సార్"—అన్నాడు సింహాచలం.

కంట్రోలు రూమ్‌కు ఫోను చేశాడు.

తన నెత్తిన భారం సగం దిగినట్టయింది. స్పాట్‌లోకి వచ్చాడు సింహాచలం.

జనంతో రోడ్డంతా నిండిపోయింది. ఆడా, మగా సానుభూతి తెలువుతున్నారు. ముచ్చటగా వున్న ఆ జంటను చూసి కొందరు కన్నీరు పెట్టుకుంటున్నారు.

ముచ్చటగా నిండు నూరేళ్ళుతోడూ నీడగా వుందామని ప్రమాణం చేసి ఏడడుగులు నడిచిన ఆ జంట "ఎవరికి ఎవరు?' ' అన్నట్లుగా ఏడుగజాల దూరంలో రోడ్డు కిరువైపులా నిశ్చలంగా పడి వున్నారు.

కంట్రోలు రూం నుంచి పోలీసు వ్యాన్ వచ్చింది.

పెద్ద సంఖ్యలో పోలీసులు దిగారు.

జనాన్ని అదుపులో పెట్టే ప్రయత్నాలు మొదలైనాయి.

బ్రతికున్న ఆ అమ్మాయినైనా త్వరగా ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలనీ, కారు నడిపినతన్ని అరెస్టు చెయ్యాలనీ జనం నుంచి కేకలు మొదలైనాయి.

అంబులెన్స్ వచ్చింది. యువజంటను గవర్నమెంటు ఆసుపత్రికి తరలించారు హెడ్ ఏడుకొండలుగారి ఆధ్వర్యంలో. "దోషి" మా కానిస్టేబులు వచ్చేసరికి తప్పించుకుపోయాడనీ, వాడు హిమాలయాల్లో వున్నా వారం తిరక్కుండా కటకటాల వెనుక్కి నెట్టేస్తామనీ, అప్పడే మా పోలీసు యంత్రాంగాన్ని ఎలర్ట్ చేశామనీ, మీరంతా నిశ్చింతగా వుండండని" ప్రజలకు హామీ ఇస్తున్నాడు అక్కడున్న సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారు.

ఆ మాటలకు జనం దేశానికి స్వాతంత్ర్యం సంపాదించినంత సంబరపడి పోయారు.

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)—రాజాలక్ష్మీ ఫౌండేషన్‌వారు నిర్వహించిన కథల పోటీలో
రూ. 500/— బహుమతి పొందిన కథ

15-7-94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

ఆడవాళ్ళు కంట తడితో, మగవాళ్ళు ఏక్సిడెంట్ జరిగిన వైనం గురించి చర్చిస్తూ ఇంటి ముఖం పట్టారు.

'అంబులెన్స్' ఆసుపత్రికి చేరింది.

డ్యూటీలో వున్న నర్సు ఏదో నవల చదువుకుంటోంది.

హెడ్ ఏడుకొండలు డాక్టరుగారి గురించి అడిగాడు.

"రాత్రి తెల్లవార్లూ ఒకటే కేసులు. కడుపునొప్పనీ, కాలు నొప్పనీ ప్రాణం తినేశారు. క్షణం కూడా కంటి మీద కునుకు లేదు.

నాకూ డాక్టరుగారికీ-ఇప్పుడే కాస్త కునుకు తీస్తున్నారు. ఒక అరగంట కూర్చోండి లేపుతాను" అంది నర్సు.

"ఇది ఏక్సిడెంటు కేసు తల్లీ లేపు" అన్నాడు హెడ్ ఏడుకొండలు.

"వీళ్ళ చావులు మా చావులకొచ్చినాయ్" అంటూ నసుగుతూ డాక్టరు రూం వైపు నడిచింది నర్సు. మరో అరగంటకు నిక్కుతూ నీల్గుతూ వచ్చారు డాక్టరుగారు.

పరీక్ష మొదలయ్యింది.

యువకుడ్ని పరీక్షించి "ఎప్పుడో ప్రాణం పోయింది" అన్నారు యువతిని పరీక్షించి. "ఇంకా ప్రాణం వుంది. బ్లడ్ ఎక్కించాలి. ముందు ఏ గ్రూపో చూడాలి. లేబ్ టెక్నీషియన్ కోసం కబురు పంపమని డాక్టరుగారు రెస్టురూంకు వెళ్ళిపోయారు. "వీళ్ళ వాళ్ళెవరో కబురు పంపండి. రక్తం కావాలి" అంది నర్సు రుసరుసలాడుతూ.

మరొక కానిస్టేబుల్ని అక్కడుంచి హెడ్ ఏడుకొండలు యువజంట ఎవరో ఆరా తీయటానికి బయలుదేరాడు.

సబ్ఇన్స్పెక్టర్ శోభయ్యగారు టాక్సీ స్టాండు వద్దకు వచ్చారు. డ్రైవరు అప్పారావు గురించి అడిగారు.

డబ్బులు దండిగా ఇస్తే ఇలాంటి ఏక్సిడెంటు కేసులు తన నెత్తిన వేసుకొని జైలుకు వెడుతుంటాడు అప్పారావు.

ఊళ్ళో లేడని చెప్పారు అక్కడివాళ్ళు.

"ఇప్పుడేం చెయ్యాలి?" శోభయ్య ఆలోచనలో పడ్డాడు.

ఎవరినో ఒకరిని అరెస్టు చేసి కథ ముగించకపోతే స్పాట్లో వున్న కారు ఎస్.పి. గారిదన్న విషయం బయటకు వస్తుంది.

పత్రికా విలేఖరులు అడిగే అడ్డదిడ్డ ప్రశ్నలకు జవాబు చెప్పవలసి వస్తుంద నుకొంటుండగా ఎవరో ఒకతను వచ్చాడు.

గడ్డం పెరిగి వుంది.

బట్టలు మాసి వున్నాయ్.

"నమస్కారం సార్! మీకో మనిషి కావాలన్నారట. కానిస్టేబులు సింహాచలంగారు చెప్పారు" అన్నాడు.

"ఉద్యోగం ఇస్తారనుకొంటున్నావా?" అడిగారు శోభయ్యగారు.

"కాదండి మీ ఎస్.పిగారి కొడుకు స్థానంలో జైలుకు వెళ్ళటానికి.

శోభయ్యకు ఈ విషయం బయట వాళ్ళకు కూడా తెలిసినందుకు ఆశ్చర్యమూ, మనిషి దొరికాడన్న ఆనందమూ ఒకేసారి కలిగాయి.

"గుడ్! తెలిసే వచ్చావన్నమాట"

"అవునండి"

"ఏ ఊరు?"

"ఏ ఊరంటే నాది భారతదేశం అని చెప్పకొనే వంశంలో పుట్టానండీ-మీ ఇంటి పేరేమిటంటే ప్రజాసేవ వారని చెప్పకొనే దంపతులు నాకు జన్మనిచ్చారండీ.

కానీ ప్రస్తుతం నిరుద్యోగినండీ.

రెండు వందల సార్లు ఇంటర్వ్యూలకు వెళ్ళాను.

అవసరమైన అర్హతలున్నా అనుభవం లేదని ఒక చోట, అండ లేదని మరొక చోట, అర్థం సమర్పించలేదని ఇంకొక చోట అనర్హుడుగా నిర్ణయింపబడి నిరుద్యోగిగానే మిగిలిపోయాను. నాకు ఈ లోకంలో మిగిలిందల్లా తల్లి.

ఆమె గవర్నమెంటు ఆసుపత్రిలో బెడ్పైన వుంది.

నవమాసాలు మోసి తన రక్తంలో భాగం పంచి పెంచి పెద్దవాణ్ణి చేసింది. తన రక్తాన్ని చెమటగా మార్చి నన్ను చదివించింది. నేనేదో ఆఫీసర్నయి పోతానని ఎన్నో కలలుకంది.

అలాంటి మాతృమూర్తికి ఆపరేషను చేయించేందుకు డబ్బులు దొరకక ఆరు నెలల నుంచీ తిరుగుతున్నాను" కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి నిరుద్యోగికి.

శోభయ్య జాలిపడ్డాడు.

కానీ ఎస్.పి.గారి మెప్పు పొందే అవకాశాన్ని జార విడుచుకోవటం అవివేకమనిపించింది.

"చెప్పండి సార్! నాకెంతిస్తారు-ఆరు నెలలు కాకపోతే ఆరు సంవత్సరాలైనా జైలుకు వెడతాను" అన్నాడు నిరుద్యోగి ఆవేశంగా.

"మహ అయితే మూడు నెలలు పడుతుంది. మిగతా విషయాలు మేము చూసుకుంటాము. 5 వేలు యిప్పిస్తాము బాబూ" అన్నాడు శోభయ్య

"నేను సిద్ధమే. ఆ డబ్బు నాకిచ్చి నన్ను ఒక్కసారి ఆసుపత్రికి తీసుకు వెళ్ళండి. మా అమ్మను ఒక్కసారి కళ్ళారా చూసి ఆ డబ్బుతో అక్కడి వాళ్ళ దాహం తీర్చి మీ వెంట వచ్చేస్తాను" అన్నాడు నిరుద్యోగి

అనుకున్న ప్రకారం డబ్బిచ్చాడు శోభయ్య.

ఇద్దరూ ఆసుపత్రికి బయలుదేరారు.

గవర్నమెంటు ఆసుపత్రి హడావుడిగా వుంది.

ఏక్సిడెంట్కు గురైన స్త్రీకి ఇంత వరకు ఏ చికిత్సా మొదలు కాలేదు.

"ఎందుకని?" అది ఎవరో సానుభూతి పరులు అడిగితే

"ఉదయం డ్యూటీకి రావలసిన డాక్టరుగారు రాలేదన్నారు"

## బ్లాక్ రోజ్



అనతి కాలంలోనే అగ్రనటుల సరసన నటించే అవకాశాలను పొంది స్టార్ డమ్కు చేరుకున్న బ్లాక్ బ్యూటీ నటి రోజా హీరోయిన్ ఛాన్స్లు రెండు చిత్రాల్లో మిస్ అయినా... అదృష్టం ఆమెను తరుముతూనే ఉంది. ఫలితంగా అన్న, భైరవదీపం హిట్ కావడంతో నటిగా మరో పది ఇంక్రిమెంట్స్ సంపాదించగలిగింది.

## జెంటిల్మెన్ క్రేజ్

జెంటిల్మెన్ చిత్రం ఏ ముహూర్తాన విడుదలైందో గాని అందులో నటించిన నటీ నటులందరికీ ఇటు సంగీత దర్శకులకు గొప్ప బ్రేకిచ్చి మరీ వదిలేసింది. ఆ ఫలితంగా అర్జున్ ప్రభు శుభశ్రీకి తెలుగులో మంచి ఆఫర్స్ వస్తున్నాయి. ప్రభుదేవాకి - అర్జున్కి, మధుబాలకి ఇప్పుడు మంచి క్రేజ్ ఏర్పడింది.



-శ్వేత

"ఇంకా బ్లడ్‌గ్రూప్ నిర్ణయం కాలేదన్నారు"

రక్తం యిచ్చే దాతలు లేరన్నారు"

"న్యూరోసర్జను కోసం కబురు పంపామన్నారు"

ఎవ్వరూ రాకుండానే ఆ అమ్మాయి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి పోయాయి.

ఇద్దరి శవాలూ పోస్టుమార్టం గదికి చేరాయి.

నిరుద్యోగి వచ్చి తల్లి వున్న వార్డంతా వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. పక్కవాళ్ళను అడిగితే మాకు తెలియదు డాక్టరుగారిని అడగమన్నారు.

నిరుద్యోగి హడావుడిగా డాక్టరు వద్దకు వెళ్ళాడు.

"మీరు వస్తే ఈ కవరు మీకివ్వమంది. ఆమె నిన్ననే డిశ్చార్జి చేయించుకొని వెళ్ళిపోయింది" అన్నారు డాక్టరు.

నిరుద్యోగిలో ఆదుర్దా పెరిగింది. కవరు చించి చదవటం మొదలు పెట్టాడు.

"బాబూ! నువ్వు నూరేళ్ళు బ్రతకవలసిన వాడివి.

మంచితనమే కాని మేము ఆస్తిపాస్తులు సంపాదించలేదు. మేము నీకు చెప్పించిన చదువుకాని, మేము మిగిల్చే మంచితనం కాని నీకు ముందు జీవితంలో తిండి పెడతాయన్న ఆశ నాలో నశించింది.

నేను జీవిత చరమాంకంలో వున్నాను. ఈ ఆరు నెలల నుంచీ నా మందులకుగానీ, ఇల్లు గడిపేందుకు గానీ నువ్వుపడిన బాధలు తలచుకొంటే నా గుండె తరుక్కుపోతోంది. అందుకే ఇక ముందు నీకు భారం కాగూడదన్న నిర్ణయానికి వచ్చాను. ఇక్కడే రెండు కిడ్నీలూ చెడిపోయిన ఒక బిడ్డ కోసం తల్లిదండ్రులు పడే ఆవేదన చూశాను. పుత్రవాత్సల్యం ఏమిటో నాకు తెలుసుకాబట్టి ఒక కిడ్నీ యిచ్చి ఆ పిల్లవాడిని బ్రతికించాలన్న నిర్ణయానికొచ్చాను. ఇందులో నా స్వార్థం కూడా వుంది. ప్రతిఫలంగా వాళ్ళు ఒక లక్ష రూపాయిలు నీకు పంపే ఏర్పాటు చేశాను. నన్ను మరచిపో. శేష జీవితాన్ని ఎక్కడో దైవసాన్నిధ్యంలో గడుపుతాను. ఆ డబ్బుతో ఏదో జీవనోపాధి కల్పించుకొని సుఖంగా బ్రతుకు"

ప్రేమతో

నీ తల్లి

ఉత్తరం పూర్తయింది. నేల మీద చతికిలబడ్డాడు నిరుద్యోగి.

'ఏమిటి బాబూ? ఏం జరిగింది?" అడిగాడు శోభయ్య.

"మీరిచ్చిన డబ్బుతో నాకిక పని లేదు శోభయ్యగారూ!" అంటూ జేబులో డబ్బు ఆయన చేతులో వుంచాడు.

శోభయ్య కంగుతిన్నాడు.

"కానీ నేనిచ్చిన మాట నిలబెట్టుకుంటాను. నా చేతులకు బేడీలు వేయండి" అన్నాడు నిరుద్యోగి.

ఎస్.పి.గారి జీపు ఆసుపత్రి ఆవరణలో ప్రవేశించింది.

ఆ వెనుక పోలీసు వ్యాను వచ్చింది.

ఎస్.పి.గారు జీపు దిగారు. శోభయ్య వెళ్ళి సెల్యూట్ కొట్టాడు.

"దోషిని పట్టుకున్నాం సార్"అన్నాడు.

ఆయన తలూపాడు.

ఈలోగా హడావుడిగా రొప్పుతూ రోజుతూ హెడ్ ఏడుకొండలు వచ్చాడు. ఎస్.పి. గారికి సెల్యూట్ కొట్టాడు.

"చనిపోయిన వారి వివరాలు తెలిశాయా?" అడిగాడు ఎస్.పి.

"తెలిశాయి సార్. అబ్బాయి ఆర్.టి.ఒ.గారబ్బాయి.

అమ్మాయి ఈ హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్‌గారమ్మాయి. నెల రోజుల క్రితమే పెళ్ళయిందట.

ఉదయమే గుడికి వెడుతున్నారట– ఈ ఏక్సిడెంట్ జరిగింది. ఇప్పుడే వాళ్ళ తల్లిదండ్రులకు తెలియపరచాను సార్" అన్నాడు.

ఎస్.పి.గారు ఒక్కసారి చలించారు. నిన్ననే తన కొడుకుకు, కలెక్టరుగార బ్బాయికి ట్రయల్ ట్రిప్ లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ యిచ్చారు ఆర్.టి.ఓ.గారు.

క్షణంలో అంతా వచ్చారు.

మరుక్షణం ఆసుపత్రి ఆవరణలో విషాదచ్ఛాయలు అలముకొన్నాయి.

సానుభూతి తెలిపేందుకు వచ్చిన వారితో ఆవరణ నిండి పోయింది.

అరగంటలో పోస్టుమార్టం పూర్తయింది.

మృతదేహాలు బయటకు వచ్చాయి.

తాను మెడికల్ సూపరింటెండ్‌గా వున్న గవర్నమెంటు ఆసుపత్రిలోనే తన ఏకైక కుమార్తె నిర్లక్ష్యానికి గురై వైద్య పాకర్యానికి నోచుకోక కాళ్ళ పారాణి ఆరకముందే కన్ను మూసినందుకు తల్లడిల్లిపోతున్నాడు ఓ తండ్రి.

కర్తవ్యాన్ని మరచి లైసెన్స్ ఇచ్చిన నేరానికి అది తన ఏకైక తనయుడి మరణానికే లైసెన్స్ పత్రంగా మారినందుకు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు మరో తండ్రి.

తప్పు చేసిన తనయుడిని రక్షించటానికి తన అధికార హోదాని అడ్డం పెట్టుకొని న్యాయానికి సంకెళ్ళు వెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు మరో తండ్రి.

రక్తం ఓడ్చి చదివించిన తనయుడు నిరుద్యోగి గానే మిగిలిపోయినందుకు అతని బ్రతుకు తెరువుకోసం, మరొకరి పుత్రునికి ప్రాణభిక్ష పెట్టడం కోసం తన కిడ్నీని దానం చేసింది ఒక మాతృమూర్తి.

ఇలా ఎంతో మంది నిర్లక్ష్యానికి ఫలితంగా యువజంట నవ్వని జీవితాలు స్మశానం పాలయ్యాయి.

రోడ్డున పోయే బిచ్చగాడు

"ఓ నరుడా! నీ గమ్య మెచ్చటికీ.

ఓ మానవుడా! నీ గమనమేమిటీ?" అంటూ పాడుకొంటూ పోతున్నాడు. ■



## మధుబాల సంచలనం

మళయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి హిట్ చిత్రం 'నీలగిరి'. 'రౌడీరాజ్యం' పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు.

మధుబాల నటించిన ప్రతి చిత్రం సంచలన చిత్రంగా గుర్తింపు పొందింది. మధుబాల తొలి సారి హీరోయిన్‌గా మమ్ముట్టి సరసన నటించిన ఐ.వి. శశి దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది.

## గోవిందా ఫస్ట్

కొందరు నటీనటులు ఆదాయంపన్ను కట్టడం తప్పించుకోవడంలో ముందుంటే, మరి కొందరు బుద్ధిమంతుల్లా ముందుగానే కట్టేస్తారు. ఈ ఏడాది హిందీనటుడు గోవిందా అందరికంటే ముందుగా 35 లక్షల రూపాయలను ఆదాయం పన్నుగా చెల్లించి 'శభాష్' అనిపించుకున్నాడు.

– అభిషేక్

